క్లుప్తంగా

జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే పూర్తి



ఆరోగ్య సురక్ష సర్వేలో మహిళలకు బీపీ పరీక్ష చేస్తున్న ఏఎన్‌ఎంలు

జగదాంబ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే సోమవారం జీవీఎంసీ 35వ వార్డులో పూర్తయింది. గత నెల 8వ తేదీ నుంచి సర్వే చేస్తూనే మరో వైపు సచివాలయాల పరిధిలో 16వ తేదీ నుంచి వైద్య శిబిరాలు నిర్వహించారు. అయితే వార్డులో మిగిలి ఉన్న లక్ష్మీనగర్, పువ్వులవీధి, అరటిపండ్లు వీధి, స్ప్రింగ్‌రోడ్డు, నూనెమిల్లు వీధి తదితర ప్రాంతాల్లో సర్వే చేశారు. సోమవారానికి వార్డులో శత శాతం సర్వే పూర్తి చేశారు. ఇప్పుడు సర్వే జరిగిన ప్రాంతాలకు సంబంధించి వైద్య శిబిరాలు వచ్చే నెల 2వ తేదీ నుంచి నిర్వహించడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. దీనిలో భాగంగా మున్సిపల్ స్టేడియంలో ఉన్న సచివాలయానికి సంబంధించి వైద్య శిబిరాన్ని వచ్చేనెల 2న ప్రసాద్‌గార్డెన్స్ డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య కేంద్రంలో నిర్వహించనున్నట్టు వైద్యుడు డాక్టర్ కె.సందేష్ తెలిపారు. ఈ శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

36, 37 వార్డుల్లో ఎమ్మెల్యే పర్యటన



మురుగు నిలిచిపోవడంతో జీవీఎంసీ సిబ్బందికి ఫోన్ చేసి సమస్య తెలుపుతున్న ఎమ్మెల్యే

డాబాగార్డెన్స్: ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ సోమవారం 36, 37 వార్డుల్లో పర్యటించారు. ఆయా వార్డుల పరిధి రెల్లివీధి అంబేడ్కర్ బొమ్మ వద్ద యూజీడీ నుంచి మురుగునీరు పొంగి రోడ్డుపై నిలిచిపోవడాన్ని ఎమ్మెల్యే గుర్తించారు. వెంటనే సంబంధిత జీవీఎంసీ సిబ్బందికి వాసుపల్లి ఫోన్ చేసి, సమస్యను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. ఫిష్ మార్కెట్ టైల్స్ మార్చాలని, వర్షం కురిసేటప్పుడు స్లాబ్ లీకై కొంత ఇబ్బంది పడాల్సి వస్తుందని ఎమ్మెల్యే దృష్టికి వ్యాపారులు తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన సంబంధిత జీవీఎంసీ అధికారులతో మాట్లాడి త్వరగా పనులు పూర్తి చేయాలన్నారు.

బాధితులకు రెడ్ క్రాస్ ఆపన్నహస్తం



రైలు ప్రమాద బాధితులకు రెడ్ క్రాస్ సహాయం

మహారాణిపేట: విజయనగరం జిల్లా కంటకాపల్లి వద్ద ఆదివారం రాత్రి జరిగిన రైళ్ల ప్రమాదంలో క్షతగ్రాతులకు రెడ్ క్రాస్ ఆపన్నహస్తం అందించింది. రెడ్ క్రాస్ విశాఖపట్నం చైర్మన్ యు.నాగేంద్రరెడ్డి ఆదేశాల మేరకు ఇండియన్ రెడ్ క్రాస్ వలంటీర్లు ఆదివారం రాత్రి నుంచి రెస్క్యూ ఆపరేషన్‌లో పాల్గొన్నారు. గాయపడినవారికి ఫస్ట్ ఎయిడ్ చికిత్సలు అందించారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించడంలో సహకారం అందించారు. జిల్లా కోఆర్డినేటర్లు సంతోష్, గౌరీ ప్రసాద్, ఇతర వలంటీర్లు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 22 మందికి జరిమానా

గోపాలపట్నం: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో 2వ స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ అండ్ సెకండ్ క్లాస్ ఎక్సైజ్ కోర్టు 22 మందికి జరిమానాలు, ఒక వ్యక్తికి 5 రోజుల జైలు శిక్ష విధించింది. గోపాలపట్నం ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలిలా.. బాజీ జంక్షన్ నుంచి గోపాలపట్నం ప్రాంతాల్లో చేపట్టిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో 23 మందిపై కేసులు ఇటీవల నమోదు చేశారు. కొత్తపాలేనికి చెందిన గంట్యాడ నాగభూషణానికి 5 రోజుల జైలు శిక్ష, రూ.50 జరిమానా వేశారు.

ఇదేం తంతు.?

- బస్టాప్‌ల్లో దుకాణాలు.. ఎండలో ప్రయాణికులు!
- యథేచ్ఛగా ఆక్రమణలు
- పట్టించుకోని అధికారులు



బస్టాపులో నిర్వహిస్తున్న వ్యాపారాలు



ఎండలో బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

జగదాంబ: పూర్ణామార్కెట్ వద్ద ప్రయాణికులకు వింత అనుభూతి ఎదురవుతోంది. ఆర్టీసీ అధికారులు ప్రయాణికుల కోసం వరుసగా మూడు బస్టాపులు నిర్మించారు. అయితే అందులో ఒక్కటి కూడా ప్రయాణికులకు ఉపయోగపడడం లేదు. బస్టాప్‌లను పలువురు వ్యాపారులు ఆక్రమించడంతో కనీసం నిల్చోవడానికి కూడా వీల్లేకుండా తయారయ్యాయి. నిత్యం నగర నలుమూలల నుంచి పూర్ణామార్కెట్‌కు వచ్చే వందలాది మంది వినియోగదారులు ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ ఆర్టీసీ బస్సుల కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రయాణికుల సహాయార్థం ఈ బస్టాపుల వద్ద ఆర్టీసీ అధికారులు ఉన్నా చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారు. బస్టాప్‌లను పూర్తిగా ఆక్రమించి వ్యాపార కార్యకలాపాలు సాగిస్తున్నా ఎందుకు స్పందించడం లేదని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు.

బస్ బే ఏర్పాటుకు వినతి

నగరాభివృద్ధిలో భాగంగా జీవీఎంసీ చేపడుతున్న బస్ బే స్టాప్‌ను పూర్ణామార్కెట్ వద్ద ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. జీవీఎంసీ పరిధిలో అన్ని చోట్లా బస్ బేలు ఉన్నాయి గానీ.. దక్షిణ నియోజకవర్గానికి సంబంధించి ఒక్క బస్ బే కూడా ఏర్పాటు చేయకపోవడం దారుణమని మండిపడుతున్నారు. నిత్యం జన సంచారంతో రద్దీగా ఉండే పూర్ణామార్కెట్ దరి దుర్గాలమ్మ జంక్షన్ సమీపంలో, బ్యారక్స్ వెళ్లే దారిలో బస్ బేలు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎమ్మెల్యే వాసుపల్లి ఔదార్యం



అల్లిపురం నేరేళ్లకోనేరులో ఈశ్వరరావుకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే



37వ వార్డు నెల్లివీధికి చెందిన బర్ల శివకు సాయం అందిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

- రోగులకు ఆర్థిక సహకారం

డాబాగార్డెన్స్: అనారోగ్యంతో మంచం పట్టిన వారికి ఆర్థిక సహకారం అందించి, ఆదుకున్నారు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్. వందలాది మందిని సొంత నిధులతో ఆదుకుంటున్న ఆయన సోమవారం పలువురికి రూ.35వేలు ఆర్థిక సాయం అందజేశారు. 38వ వార్డు గాంధీబొమ్మ ప్రాంతానికి చెందిన రాజారావు పక్షవాతంతో బాధపడుతూ మంచానికే పరిమితమయ్యారు. జీవనోపాధి కోల్పోయి ఆర్థికంగా ఇబ్బంది పడుతుండడంతో రూ.5వేలు సాయం అందజేశారు. 37వ వార్డు నెల్లివీధికి చెందిన బర్ల శివ పక్షవాతంతో ఎటూ వెళ్లలేని పరిస్థితిలో కుటుంబ పోషణ కష్టతరంగా ఉన్న నేపథ్యంలో పరామర్శించి, రూ.5వేలు అందజేశారు. 37వ వార్డు గొల్లవీధికి చెందిన సెనగల అచ్చయ్యమ్మ అనారోగ్యంతో మంచాన పట్టడంతో ఫిజియోథెరపీ కోసం రూ.5వేలు, 32వ వార్డు అల్లిపురం నేరేళ్లకోనేరు ప్రాంతానికి చెందిన మీసాల ఈశ్వరరావు పక్షవాతంతో మంచానపట్టడంతో మందుల కొనుగోలుకు రూ.5వేలు, అదే ప్రాంతానికి చెందిన గోపిన గోవిందరాజ్ కాలేయ, కిడ్నీ, ఊపిరితిత్తుల సమస్యతో బాధపడుతుండడంతో రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు పలువురు కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారుల వినతి



ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్‌కు సమస్య వివరిస్తున్న మహిళలు

మహారాణిపేట: రహదారి విస్తరణ అంశంలో తమకు న్యాయం చేయాలని 30వ వార్డుకు చెందిన పలువురు చిరు వ్యాపారులు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్‌ను కోరారు. వార్డు కార్పొరేటర్ కోడూరు అప్పలరత్నం ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిసి తమ సమస్యను విన్నవించారు. రోడ్డు విస్తరణ వల్ల తాము వ్యాపారాలను కోల్పోయామని మహిళలు తెలిపారు. న్యాయం చేయాలని కోరారు.

బంద్ విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న విద్యార్థి, యువజన సంఘాల జేఏసీ

సీతమ్మధార: విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాటం చేపట్టి నవంబర్ 8వ తేదీతో వెయ్యి రోజులు పూర్తవుతున్న సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్న విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని విద్యార్థి, యువజన సంఘాల ప్రతినిధులు కోరారు. ఈ మేరకు జీవీఎంసీ గాంధీ పార్కు వద్ద బంద్ పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉక్కు పోరాటాన్ని నీరుగార్చే విధంగా వ్యవహరిస్తున్నాయన్నారు. వెయ్యి రోజులుగా కార్మికులు, ప్రజలు పోరాటాలు చేస్తున్నా పట్టించుకోకుండా స్టీల్‌ప్లాంట్‌ను నష్టాల్లోకి నెట్టే కుతంత్రాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోదీని గద్దె దించి, స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించుకుంటామన్నారు. విద్యార్థులు, ప్రజలు, విద్యాసంస్థల యాజమాన్యాలు బంద్‌లో స్వచ్ఛందంగా పాల్గొని, జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ యు.ఎ స్.ఎన్.రాజు, నాయకులు రాంబాబు, ఎల్.జె.నాయుడు, యు.నాగరాజు, అభిలాష భానుశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్య భద్రతే సీఎం జగన్ లక్ష్యం



వైద్య పరీక్షలు చేస్తున్న వార్డు అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వరరెడ్డి

సీతమ్మధార : ప్రజల ఆరోగ్య భద్రతే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని వైఎస్సార్‌సీపీ 27వ వార్డు అధ్యక్షుడు, ఎరుకుమాంబ ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ నీలాపు సర్వేశ్వరరెడ్డి అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా 27వ వార్డులోని 142వ సచివాలయం పరిధిలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు స్పెషలిస్ట్ వైద్యులతో పరీక్షలు చేయించి, మందులు అందజేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, సచివాలయ కన్వీనర్లు, ఆశా వర్కర్స్ పాల్గొన్నారు.

‘జగనన్న ఆరోగ్య సురక్ష’కు విశేష స్పందన

- యాతపేట సచివాలయ పరిధిలో 531 మందికి వైద్య పరీక్షలు



రోగులకు మందులు అందజేస్తున్న కార్పొరేటర్ తోట పద్మావతి

అల్లిపురం: ప్రజల సంపూర్ణ ఆరోగ్యమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి అన్నారు. ఇందుకోసం ఎన్నో కార్యక్రమాలను అమలు చేస్తూ, ప్రజల చెంతకే వైద్య సేవలు అందేలా చూస్తున్నారన్నారు. యాతపేట సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష టోకెన్లు జారీ చేసిన వారికి కొబ్బరితోట డాక్టర్ వైఎస్సార్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం నిర్వహించిన వైద్యశిబిరాన్ని సోమవారం ఆమె పరిశీలించారు. పేదల కోసం నిర్వహిస్తున్న ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిబిరంలో వైద్యులు సుమారు 531 మందిని పరీక్షించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. వైద్య శిబిరానికి వచ్చిన వారికి అంగన్‌వాడీ కార్యకర్తలు పోషకాహారంపై అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు ఏ ఆహార పదార్థాలు తీసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో 33, 34, 35, 41 క్లస్టర్ మండల అధ్యక్షుడు కర్రి నీలకంఠం, వార్డు సీనియర్ నాయకులు లండా రమణ, లింగం శ్రీనివాసరావు, సూరిబాబు, పిల్ల సత్తిబాబు, వైట్ తదితరులు సహకారం అందించారు.

చెదల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

సీతమ్మధార: మనస్తాపంతో ఓ వ్యక్తి చెదల నివారణ మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. అక్కయ్యపాలెం మాదేటి గార్డెన్స్‌లో గుప్తా(48), పవనొట్టి సావిత్రి దంపతులు నివసిస్తున్నారు. రెండేళ్లుగా నోటి క్యాన్సర్‌తో అతడు బాధపడుతున్నాడు. ఎంవీపీలోని మహాత్మా గాంధీ క్యాన్సర్ హాస్పిటల్‌లో ఆపరేషన్ చేయించుకున్నాడు. కొద్ది రోజులుగా మానసికంగా బాధపడుతున్న గుప్తా సోమవారం ఇంట్లో ఉన్న చెదల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న భర్త నోటి నుంచి రక్తం రావడాన్ని భార్య గమనించి వెంటనే కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గుప్తా మృతిచెందాడు. మృతుడి భార్య సావిత్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ విజయకుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తొలగించిన 26 కులాలను బీసీ జాబితాలో చేర్చాలి



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న ఉత్తరాంధ్ర ప్రజా పార్టీ నాయకులు

సీతమ్మధార : తెలంగాణ రాష్ట్రంలో తొలగించిన 26 కులాలను తిరిగి బీసీ జాబితాలో చేరుస్తామని అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అన్ని రాజకీయ పార్టీలు స్పష్టమైన హామీ ఇవ్వాలని ఉత్తరాంధ్ర ప్రజా పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేశారు. ముందుగా గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర ప్రజా పార్టీ అధ్యక్షుడు కర్రి ఆదిబాబు మాట్లాడుతూ రాష్ట్రం విడిపోయిన తరువాత బీసీ కమిషన్ నివేదిక లేకుండా 26 కులాలను బీసీ జాబితా నుంచి 2014లో తొలగించారని ధ్వజమెత్తారు. దీంతో ఉత్తరాంధ్ర నుంచి వలస వెళ్లిన ప్రజలు విద్య, ఉద్యోగ అవకాశాలు కోల్పోయి తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. ఉత్తరాంధ్ర ప్రజలకు అన్యాయం చేసిన కేసీఆర్‌కు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు రాజ్‌గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ మెట్ట రామారావు, ఉపాధ్యక్షుడు ఇలాపండ చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి ఎద్దు శ్రీలక్ష్మి, ఉపాధ్యక్షుడు కూన రామారావు పాల్గొన్నారు.

‘రైలు ప్రమాదంపై సమగ్ర దర్యాప్తు’



ఘటనా స్థలంలో సహాయక చర్యలు చేపడుతున్న సిబ్బందికి ఆహారం, నీరు అందిస్తున్న ప్రసాదనాయుడు

అల్లిపురం: ఇటీవల ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో జరిగిన రైలు ప్రమాదాలపై సమగ్ర దర్యాప్తు చేపట్టి, కఠిన చర్యలు తీసుకోవాలని జ్యోతిబాపూలే ఆలిండియా ఓబీసీ అసోసియేషన్ అధ్యక్షుడు పోతల ప్రసాదనాయుడు డిమాండ్ చేశారు. విజయనగరం జిల్లా అలమండ దగ్గర జరిగిన రైలు ప్రమాద స్థలాన్ని ఆయన సోమవారం సందర్శించారు. మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేసియా ప్రకటించినందుకు ముఖ్యమంత్రికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. ఘటనా స్థలం వద్ద సహాయక చర్యలలో నిమగ్నమైన సిబ్బందికి మంచినీరు, ఆహార పదార్థాలు ఆయన అందజేశారు. ప్రమాదంపై ప్రధానమంత్రి మోదీకి వినతి పత్రం ఇవ్వనున్నట్లు తెలిపారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన నేడు

డాబాగార్డెన్స్: విశాఖ వాసుల ఆరాధ్య దైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891-2711725, 2566514 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 టౌన్ కొత్తరోడ్డు బ్రాంచి, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తామని ఆలయ అధికారులు తెలిపారు.

ఆటోలో మేయర్.. సైకిల్‌పై కమిషనర్



ఆటోలో జీవీఎంసీకి చేరుకున్న మేయర్



తన బంగ్లా నుంచి సైకిల్‌పై జీవీఎంసీకి వస్తున్న కమిషనర్

- సొంత వాహనాలు వదిలి కార్యాలయానికి పయనం
- కాలుష్య నియంత్రణకు సహకరించాలని విన్నపం

డాబాగార్డెన్స్: కాలుష్య నియంత్రణకు ప్రతీ ఒక్కరు సహకరించాలని నగర మేయర్ గొలగాని హరివెంకట కుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ కోరారు. మేయర్ హరివెంకట కుమారి సోమవారం తమ సొంత వాహనం వదిలి క్యాంపు కార్యాలయం నుంచి ఆటోలో ప్రయాణించి జీవీఎంసీకి చేరుకున్నారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తన బంగ్లా నుంచి సైకిల్‌పై జీవీఎంసీకి వచ్చారు. అనంతరం జీవీఎంసీలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమంలో ఇద్దరూ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ నగరంలో వాయి, శబ్ద కాలుష్యం పెరిగిపోయిందని, వాటి నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. నగరంలోని ప్రైవేట్, ప్రభుత్వ సంస్థల యాజమాన్యాలు వారంలో ఒక్క రోజు ప్రజా రవాణాను వారి సిబ్బందితో ఉపయోగించేలా చూడాలన్నారు. సాధ్యమైనంత వరకు విద్యుత్ వాహనాలు ఉపయోగించాలని సూచించారు.

మహాధర్నాను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నర్సింగరావు

డాబాగార్డెన్స్: దేశంలో మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రైవేటీకరణ విధానాలు విడనాడాలని సిటూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు పిలుపునిచ్చారు. నవంబర్ 27, 28 తేదీల్లో విజయవాడలో జరగనున్న మహాధర్నా విజయవంతం చేయాలని కోరారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సోమవారం నిర్వహించిన సిటూ జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, విద్యార్థులు, యువజనులు, మహిళలు, దళితులు తదితర అన్ని తరగతుల ప్రజానీకంపై తన దాడిని ఎక్కుపెట్టిందన్నారు. భారతదేశ ఆర్థిక వ్యవస్థకు పట్టుకొమ్మలుగా ఉన్న ప్రభుత్వరంగ సంస్థలను ఆదానీ, అంబానీలకు కట్టబెడుతోందన్నారు. దీంతో పాటు రైతాంగానికి, వ్యవసాయ కార్మికులకు నష్టం చేసేలా అనేక చర్యలు చేపడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టీల్ ప్లాంట్, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, కార్మికులకు నష్టం చేసే 4 లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, పంటలకు కనీస మద్దతు ధర కల్పించాలని, ప్రజలకు నష్టం చేసే విద్యుత్ సవరణ చట్టం 2020 రద్దు చేయాలన్న డిమాండ్లతో దేశంలోని అఖిలపక్ష కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం సంయుక్తంగా నవంబర్ 27, 28 తేదీల్లో అన్ని రాష్ట్రాల్లో మహాధర్నాలు జరపాలని పిలుపునిచ్చాయన్నారు. విజయవాడలో 48 గంటల పాటు నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిటూ నాయకులు కేఎం శ్రీనివాసరావు, ఆర్‌కేఎస్‌వీ కుమార్, ఎస్.జ్యోతీశ్వరరావు, బి.జగన్, సీతాలక్ష్మి, మంగశ్రీ, అప్పలరాజు, జి.శ్రీనివాస్‌తో పాటు పలు యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.

అయ్యప్ప మాలధారులకు నిత్యాన్నదానం ప్రారంభం



అయ్యప్పలకు అన్నసమారాధన ప్రారంభిస్తున్న సీతంరాజు సుధాకర్

అల్లిపురం: వైర్లెస్ కాలనీలో హరిహరాత్మజ అన్నదాన చారిటబుల్ ట్రస్ట్, కోదండ రామాలయ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో అయ్యప్ప మాలధారులకు నిత్యాన్నదానం సోమవారం ప్రారంభమయింది. కార్యక్రమాన్ని విశాఖ దక్షిణ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకుడు సీతంరాజు సుధాకర్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మాలధారులకు నిత్యాన్నదానం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ డిసెంబర్ 9వ తేదీ వరకు నిత్యాన్నదానం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత 6 సంవత్సరాలుగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. రోజుకు ఎనిమిది వందల నుంచి 12 వందల మంది స్వాములు అన్నప్రసాదాన్ని స్వీకరిస్తారని తెలిపారు. రోజూ మూడు పూటలా స్వాములకు ప్రసాద వితరణ జరుగుతుందన్నారు. ఈ సదవకాశాన్ని స్వాములందరూ వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపకుడు కడగల శ్రీనివాసరావు, కంచు వెంకట రమణమూర్తి, కోదండ రామాలయం అధ్యక్షుడు కొత్తపల్లి సుబ్రమణ్యం, కోటేశ్వరరావు, ఉరుకూటి నారాయణ, ఆళ్ల లీలావతి, చెన్నా జానకి రామ్ తదితరులు పాల్గొన్నారు.

రౌడీ షీటర్లపై పూర్తి నిఘా

- సీపీ రవిశంకర్



ఏసీపీ కార్యాలయం నుంచి బయటకు వస్తున్న సీపీ రవిశంకర్

గోపాలపట్నం: రౌడీషీటర్ల కదలికలపై పూర్తి నిఘా ఉంచాలని నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ ఆదేశించారు. వెస్ట్ ఏసీపీ కార్యాలయంతో పాటు ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్, కంచరపాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికరంగా తనిఖీ చేశారు. వెస్ట్ సబ్ డివిజన్ ఏసీపీ కార్యాలయంలో నమోదవుతున్న పలు కేసులు గురించి ఆరా తీశారు. మహిళలపై ఎటువంటి దాడులు జరగకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. దిశ యాప్‌పై మరింత అవగాహన కల్పించాలని సూచించారు. సబ్ డివిజన్ పరిధిలో ఎన్‌డీపీఎస్ కింద నమోదైన కేసులతో పాటు పలు మార్లు అరెస్ట్ అయిన ఫెడర్లపై పీడీ యాక్టు నమోదు చేసే చర్యలపై చర్చించారు. డివిజన్ పరిధిలోని స్టేషన్ల పని తీరుపై ఏసీపీ అన్నెపునరసింహ మూర్తిని అడిగి తెలుసుకున్నారు. కంచరపాలెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రమాదాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. సిబ్బంది పని తీరును పరిశీలించారు. ట్రాఫిక్ రద్దీ ప్రాంతాల్లో ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్‌లో సిబ్బందిని పని తీరును పరిశీలించారు. పెండింగ్ కేసుల గురించి విచారించారు. వాటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ఆయనతో పాటు డీసీపీ-2 ఆనందరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జీఎస్‌టీ అధికారుల తనిఖీలు



ఉప్పల మంగరాజు గిడ్డంగిలో తనిఖీలు చేస్తున్న జీఎస్టీ అధికారులు

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డు సంతబయలు ప్రాంతంలో సోమవారం సాయంత్రం ఉప్పల మంగరాజుకు చెందిన వ్యాపార సంస్థలో జీఎస్టీ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఆయన సోదరుడు ఉప్పల రమేష్‌బాబు ఫిర్యాదు మేరకు వీరు వచ్చినట్టు తెలిసింది. సంతబయలు ప్రాంతంలో ఉప్పల చిన వెంకటరమణకు 15వ నంబరు రేషన్ డిపో ఉంది. ఈ డిపో ఉన్న షాపు తనదని కొంతకాలంగా తండ్రి చిన వెంకటరమణ, తమ్ముడు మంగరాజుతో రమేష్‌బాబు న్యాయపోరాటం చేస్తున్నాడు. దీనిపై పలుమార్లు పౌరసరఫరాల శాఖ అధికారులు, భీమిలి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తూ వస్తున్నాడు. ఇటీవల తన తమ్ముడు అగ్గిపెట్టెల వ్యాపారంతో పాటు అక్రమంగా గుట్కా వ్యాపారం చేస్తున్నట్టు ఆరోపిస్తూ సెంట్రల్, స్టేట్ జీఎస్టీ అధికారులకు ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. ఈ మేరకు ఈ నెల 18న సెంట్రల్ జీఎస్టీ అధికారులు, సోమవారం స్టేట్ జీఎస్టీ అధికారులు మంగరాజు గిడ్డంగిని పరిశీలించి అగ్గిపెట్టెలు మాత్రమే ఉన్నట్టు గుర్తించినట్టు తెలిసింది. తనిఖీలకు సంబంధించి జీఎస్టీ అధికారులు ఎలాంటి సెర్చ్ వారెంట్లు తనకు చూపలేదని మంగరాజు తెలిపారు. దీనిపై మిగిలిన వివరాలు తెలియాల్సి ఉంది.